సాక్షి పల్నాడు
ఆదివారం । 3 । నవంబర్ । 2024



గ్రంథాలయంలో తనిఖీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బా రత్తమ్మ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.



ప్రసన్నాంజనేయుని మాలధారణ

బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం భక్తులు మాలధారణ చేపట్టారు.



బిక్ష ప్రారంభం

చిలకలూరిపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సుభానీనగర్‌లో ఉన్న హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం బిక్ష కార్యక్రమం ప్రారంభించారు.

నాడు పవిత్రం... నేడు అపవిత్రం

మురికికూపంగా నాగులేరు



బ్రిడ్జికి ఉత్తరాన నాగులేరులో పేరుకున్న వ్యర్థాలు

- పల్నాటి చరిత్రలో జీవనదిగా విశిష్ట స్థానం
- వ్యర్థాలతో నిండి దుర్గంధం
- ఆ మార్గంలో ప్రయాణించేందుకు అవస్థలు
- విచ్చలవిడిగా ఆక్రమణలు
- యథేచ్ఛగా తవ్వకాలు
- కుచించుకుపోతున్న నాగులేరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కారెంపూడి: ఆనాడు పల్నాటి వీరుల రక్తంతో ప్రవహించిన నాగులేరు..నేడు వ్యర్థాలతో నిండిపోయి మురికికూపంగా మారింది. ఈ నెలాఖరు కార్తీక అమావాస్య నుంచి పల్నాటి వీరారాధన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మరో వైపు నాగులేరు మాత్రం గర్భశోకంతో తల్లడిల్లిపోతోంది. ఉత్సవాలకు వచ్చే వీరాచారులు నాగులేరు గంగధారిలోనే పుణ్యస్నానాలు ఆచరిస్తారు. వారి దైవాలు (ఆయుధాలు)లను ఇక్కడే శుభ్రం చేసుకుని వాటికి ప్రాణ ప్రతిష్ట చేసుకుని పూజ కట్టుకుంటారు. అంతటి ప్రాధాన్యం నాగులేరుకు ఉంది. నాగులేరు ఒడ్డునే పల్నాటి రణం జరిగిన విషయం తెల్సిందే. పల్నాటి చరిత్రలో నాగులేరు జీవనదికి విశిష్ట స్థానం ఉంది. అందుకేనేమో శ్రీనాధుడు నాగులేరు గంగధారిని కాశిలోని మణికర్ణిక నది అంతటి పవిత్రమైనదిగా వర్ణించారు. అంతటి ప్రాధాన్యం ఉన్న నాగులేరు దాని పరివాహ ప్రాంత దుస్థితి ఇది.

కొనసాగుతున్న ఆక్రమణల పర్వం

మరో వైపు వాగు పరివాహ ప్రాంతం ఆక్రమణలకు గురౌతోంది. చెన్నకేశవస్వామి ఆలయం నుంచి నాగులేరు గంగధారి మడుగుకు వచ్చే విశాలమైన వీర్ల డొంక నామమాత్రపు దారిగా మారిపోయింది. వీర్లగుడి నుంచి కళ్లిపోతురాజు మండపానికి వెళ్లే విశాలమైన వీర్ల డొంక కాస్త చిన రోడ్డుగా మారిపోయింది. ఈ రెండు దారులు ఉత్సవాలలో చాలా ముఖ్యమైనవి. పల్నాటి వీరాచారులు వీరుల ఆయుధాలతో నాగులేరులో పూజకట్టుకున్న అనంతరం పలు కార్యక్రమాలు క్రతువులు నిర్వహించే ప్రధాన దారులివి. నాగులేరు పరివాహ ప్రాంతం 1100 ఎకరాల దాకా ఉందని గతంలో జరిగిన సర్వేలో తేలింది. అయితే వాగు పారే దారి ఒకటి ఉంచి మిగతా ప్రాంతాలలో పాగా వేశారు. ఇంకా మిగిలిన దాన్లో పాగా వేసేందుకు సకలం సిద్ధం చేసుకుంటున్నారు. మరో వైపు నాగులేరును విచ్చలవిడిగా గ్రావెల్ కోసం తవ్వేస్తున్నారు. దీంతో నాగులేరు గర్భశోకంతో తల్లడిల్లిపోతోంది. 1980 ప్రాంతంలోనే అప్పటి గ్రామ సర్పంచ్ నాగులేరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఏకంగా వాచ్‌మెన్‌ను నియమించి వాగు నీటిని పరిశుభ్రంగా అందరూ వినియోగించుకునేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత పట్టించుకున్న వారే లేరు. దీంతో నాగులేరులో వ్యర్థాలు కలసి నీరు కలుషితమై తాగేందుకు పనికిరాకుండా పోయింది. ఇప్పటికైనా వ్యర్థాలను తొలగించి కలుషితం కాకుండా చూడాలని కోరుతున్నారు.

డంపింగ్ యార్డుగా మార్చేశారు..

నాగులేరును డంపింగ్ యార్డుగా మార్చేశారు. బస్టాండ్‌లో పోగైన వ్యర్థాలను అత్యంత బాధ్యతారాహిత్యంగా నాగులేరులో వేస్తున్నారు. అవి పేరుకుపోయి కుళ్లి వాగు నుంచి దుర్గంధం వస్తోంది. నాగులేరు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించేవారికి ఇది తీవ్ర అసౌకర్యంగా మారింది. గ్రామస్తులతోపాటు ఉత్సవాలకు వచ్చే వారు టాయిలెట్స్ లేకపోవడం వల్ల వాగు పరివాహ ప్రాంతాన్నే అందుకు వాడుతున్నారు. ఇది చూడలేక ఒక దాత టాయిలెట్స్ నిర్మాణానికి పూనుకుని నిర్మాణం చేయించారు. దాన్ని కొందరు అడ్డుకోవడంతో మిగిలిన పనులు కాస్తా నిలిచిపోయి అది నిరుపయోగంగా మారింది.



నిలిచిపోయిన టాయ్‌లెట్స్ నిర్మాణం

పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది



వీర్ల గుడితోపాటు పల్నాటి రక్షిత కట్టడాలున్న వాగు పరివాహ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాగు కాలుష్యం చూడలేక వారం రోజులు శ్రమించి వ్యర్థాలు ఏరివేశాను. కానీ అందరూ వేస్తుంటే వాగు బాగు సాధ్యం కాదు. అందరూ తమదిగా భావించి పరిరక్షణకు కృషి చేయాలి. కనీసం వ్యర్థాలు అయినా వేయకుండా ఆపాలి. పల్నాటి చరిత్రకు సాక్షిగా నిలిచిన నాగులేరును పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి.

– కొమెర అంకారావు(జాజి), పర్యావరణ వేత్త


సౌకర్యాలు కల్పించాలి..



వీరాచారం నెరవేర్చుకోవడం ఎక్కువగా నాగులేరుతోనే ముడిపడి ఉంది. వాగు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వీరాచారవంతులు ఆచారాన్ని నెరవేర్చుకుని వెళ్తారు. ఉత్సవ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచితే ముఖ్యంగా స్నానాలు ఆచరించడానికి, ఆయుధాలను శుభ్రం చేసుకోడానికి పూజా కార్యక్రమాలకు సౌకర్యంగా ఉంటుంది.

–పిడుగు తరుణ్ చెన్నకేశవ, పల్నాటి వీరాచార పీఠాధిపతి

త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక మాసం తొలిరోజున కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి నెలకొంది. అయ్యప్పమాలధారులు తొలిపూజలో పాల్గొన్నారు. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు జరిపారు. ధ్యానశివుడు, నాగేంద్రుడి పుట్ట, మహానందీశ్వరుడు విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మెట్లపూజలో పాల్గొని సోపాన మార్గం ద్వారా ఆలయానికి చేరుకొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో కార్తిక సందడి




అమరావతి: అమరావతి క్షేత్రంలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తికమాసం ప్రారంభం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుంచే అమరేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో కార్తిక స్నానాలు చేసి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందిపడకుండా క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, ఉచిత అన్నదానం, ప్రసాదం అందజేశారు. గతేడాది లాగానే గ్రామంలో, ఆలయంలో, స్నానఘాట్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ బందోబస్తు నిర్వహిస్తుంది. అమరావతి ప్రధానవీధిలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద భక్తులకు విద్యుత్ వెలుగులతో స్వాగత తోరణాలతోపాటు రోడ్డు కిరువైపులా విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేసి దేవాలయానికి రాజగోపురానికి విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయటంతో ఆలయంగా శోభాయమానంగా ఉంది.

డిసెంబర్ 14న మెగా లోక్‌అదాలత్



రేపల్లె రూరల్: కక్షిదారుల సమయం, ధనం వృథా కాకుండా రాజీపడదగిన కేసులను పరిష్కరించేందుకే డిసెంబర్ 14న మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టీ.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సబ్‌కోర్టు హాలులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ప్రీలిటికేషన్ కేసులను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సిబ్బంది, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దు



వేటపాలెం: నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ మహిళలు శనివారం అడ్డుకున్నారు. స్థానిక సంతారావూరు రోడ్డు, చీరాల-వేటపాలెం రోడ్డులో సెంటర్‌కి దగ్గరలో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయ తలపెట్టిన మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని స్థానిక మహిళలు ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. షాపు ఏర్పాటు చేయతలపెట్టిన యజమానులకు.. ఆందోళనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులకు సర్ది చెప్పి విరమింపజేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి



తెనాలిరూరల్: మండల పరిధిలోని కొలకలూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ప్రసాదం తిరుపతమ్మ(107) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు. ఆమె కుమారుడు ప్రసాదం భాస్కరరావు కొలకలూరు గ్రామ మాజీ సర్పంచ్‌గా పనిచేశారు. మిగిలిన ఇరువురు కుమారులు వివిధ వ్యాపారాలలో ఉన్నారు. మనుమడు ప్రసాదం సురేష్ మొండిబండ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉన్నారు. తిరుపతమ్మ భర్త ముసలయ్య కూడా దాదాపు 98 సంవత్సరాలు జీవించి పదేళ్ల కిందట మృతి చెందారు. తిరుపతమ్మ మృతికి పలువురు మొండిబండ సంఘ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు నివాళులర్పించారు. ఆమె అంత్యక్రియలు శనివారం సాయంత్రం ముగిశాయి.

వేగవంతంగా రహదారుల అభివృద్ధి

కలెక్టర్ అరుణ్‌బాబు

రెంటచింతల: మిషన్ పాత హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా గుంతలు పూడ్చి రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. శనివారం మండలంలోని మంచికల్లు గ్రామంలో ఆయన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి రహదారుల అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి, మాట్లాడారు. రానున్న రోజులలో రోడ్లు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మాచర్ల నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల సేకరణపై రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలు తొలిగించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీ లావు కృష్ణదేవరాయలు కృషితో మాచర్ల నియోజకవర్గంలోని 4 రోడ్ల మరమ్మతులకు అనుమతులు లభించినట్లు తెలిపారు. రానున్న సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేయడానికి కృషి చేస్తానన్నారు. పాలువాయిగేటు- మంచికల్లు మధ్య 2.6 కి.మీ రహదారిని రూ.15 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి మురళీకృష్ణ, రోడ్లు భవనాల శాఖాధికారి రాజానాయక్, ఎంపీడీఓ సరోజినీదేవి, తహసీల్దార్ కె.నగేష్, నాయకులు వెంకటరామిరెడ్డి, వై.మట్టయ్య, జి.పుల్లారెడ్డి తదితరులున్నారు.



మంచికల్లులో రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కాలకృత్యాలకూ కష్టాలే..!



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత బుధవారం కురిసిన భారీ వర్షానికి పాఠశాల ప్రాంగణంలో నీరు నిలిచింది. కాగా గురువారం పాఠశాలలోని అదనపు తరగతి గదులకు వెళ్లేందుకు కూడా కుదరలేదు. విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి బోధించారు. మరుగుదొడ్లకు వెళ్లేందుకు కూడా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కనే ఉన్న ఇటుకలను నీటిలో పరుచుకొని, దాటుకుంటూ వెళ్లొస్తున్నారు. మూడు రోజులుగా పరిస్థితి ఇలా ఉంటే అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– బెల్లంకొండ

సూర్యలంక తీరానికి కార్తిక శోభ

- ప్రారంభం అయిన కార్తిక మాసం
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మహిళలు
- తెల్లవారుజామునే తీరంలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు



సూర్యలంకలో సముద్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బాపట్లటౌన్: కార్తికమాసం ప్రారంభం కావటంతో భక్తులు శైవక్షేత్రాలను దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళలు తెల్లవారుజామునే సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్యస్నానాలుచేసి తీరం ఒడ్డున పసుపు, కుంకుమ, ఐదు రకాల పూలు, పండ్లతో గౌరిదేవి పూజలు నిర్వహించారు. గౌరీదేవి ప్రతిమలను సూర్యలంక తీరంలో కలిపి సూర్యనమస్కారాలతో కూడిన స్నానాలు ఆచరించారు. స్నానాల అనంతరం తీరం వెంబడి ఉన్నటువంటి తారకేశ్వరస్వామి దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

బాపట్ల పట్టణంలో వేంచేసియున్న సోమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు శనివారం తెల్లవారుజామున పోటెత్తారు. పుణ్య స్నానాలనంతరం అధిక సంఖ్యలో మహిళలు సోమేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు నుంచి ఆరు గంటల వరకు స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి భారీసంఖ్యలో చేరుకున్న మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, గౌరీదేవి పూజలు, పుష్పార్చన కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని గంగా పర్వతవర్ధనీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, త్యాగరాయనగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి, మండలంలోని వెదుళ్లపల్లిలో గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, అప్పికట్లలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

రెండు, మూడు రోజుల్లో పామాయిల్ ప్యాకెట్లు

సాక్షి ఎఫెక్ట్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాయితీపై వినియోగదారులకు అమ్మేందుకు జిల్లాకు రెండు, మూడు రోజుల్లో పామాయిల్ నూనె ప్యాకెట్లు వస్తాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.పి.కోమలిపద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'వంట నూనెలు సలసల' కథనానికి స్పందించారు. సౌత్ ఇండియా కృష్ణ (కృష్ణపట్నం) నుంచి జిల్లాలో గుర్తించిన నలుగురితోకు వ్యాపారస్తులకు పామాయిల్ నూనె ప్యాకెట్ల సరఫరాకు ఒప్పందం కుదిరిందని, వారి వద్ద నుంచి రెండుమూడురోజుల్లో నూనె ప్యాకెట్లు రాగానే రైతు బజార్లలో అమ్మకాలు పునఃప్రారంభిస్తామని వెల్లడించారు.

అదుపు తప్పింది!



రొంపిచర్ల: ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంవైపు దూసుకెళ్లిన సంఘటన మండలంలోని తుంగపాడు గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బస్సు గ్రామంలోని 20 మంది స్కూల్ పిల్లలతో ఉదయం నరసరావుపేటకు బయలుదేరింది. గ్రామం విడిచి కొద్ది దూరం రాగానే స్టీరింగ్ రాడ్ విరిగి పోవటంతో అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించటంతో పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోకుండా బస్సు ముందుకు రావటంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని స్కూల్ పిల్లలందరూ క్షేమంగా ఉండటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

గుండ్లకమ్మలో దూకి విద్యార్థి ఆత్మహత్య?



దుర్గాప్రసాద్

అద్దంకి రూరల్: గుండ్లకమ్మ నదిలో దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం అద్దంకిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ కృష్ణయ్య.. ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అద్దంకిలోని గరటయ్య కాలనీ 19వ లైన్‌లో నివాసం ఉంటున్న దాట్ల శ్రీను కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీనుకు ఇద్దరు కుమారులు కాగా.. చిన్నవాడైన దాట్ల దుర్గాప్రసాద్ (18) స్థానిక విశ్వభారతి కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం దుర్గాప్రసాద్ తన అన్నతో.. తనకు తిమ్మాయపాలెంలో ఉన్న స్నేహితుడు డబ్బులు ఇస్తానన్నాడని.. తీసుకుని వస్తాను తోడురమ్మని అన్నతోపాటు బైకుపై తిమ్మాయపాలెంలో బయలుదేరాడు. మార్గంమధ్యలోని గుండ్లకమ్మ నదిమీద ఉన్న బ్రిడ్జి వద్దకు రాగానే డబ్బులు కిందపడ్డాయి అని చెప్పి.. అన్నను బైకు ఆపమన్నాడు. బైకు ఆపగానే అకస్మాత్తుగా పరుగెత్తుకుంటూ వెళ్లి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకాడు. అతని అన్న కేకలు వేయటంతో స్థానికులు వచ్చి చూడగా నదిలో కొట్టుకుపోతూ కొంతసేపు కనిపించి ఆ తరువాత మాయం అయ్యాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై, సీఐలు, ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. మృతదేహం ఇంకా దొరకలేదు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది.

6 నుంచి క్రీడల్లో సివిల్ సర్వీస్ ఉద్యోగుల ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి ఎన్టీఆర్, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 18 క్రీడాంశాలకు సంబంధించి రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల ఎంపిక జరగనుంది. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఎంపికలకు జిల్లా స్థాయిలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అర్హులు.

ఓటమి విజయానికి తొలి మెట్టు

- నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు
- ఘనంగా ప్రారంభమైన 68వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు
- హాజరైన 370మంది క్రీడాకారులు, 100మంది సిబ్బంది


టోర్నమెంట్‌కు హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవటం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పల్నాడుజిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ అధ్యక్షతన పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, ఓటమిని గెలుపునకు మెట్లుగా మల చుకుంటూ ఎదగటమే క్రీడల ద్వారా విద్యార్థులు నేర్చుకోవలసిన జీవిత పాఠాలని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు క్రీడాకారులు నిర్వహించిన కవాతును తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ క్రీడా జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, పోటీల పరిశీలకుడు కె.కృష్ణారెడ్డి (పశ్చిమ గోదావరి), వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు అన్ని జిల్లాల నుంచి 370మంది క్రీడాకారులు, దాదాపు 100మంది కోచ్‌లు, టీం మేనేజర్లు హాజరయ్యారు. టోర్నమెంట్‌లో భాగంగా ప్రతిభ చూపిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేసి ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్టు స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, డీఈఓ చంద్రకళ

తొలిరోజు మ్యాచ్‌ల వివరాలు..

తొలిరోజు బాలుర విభాగంలో గుంటూరుజిల్లా జట్టుపై నెల్లూరు జట్టు 18–21, విజయనగరంపై విశాఖ 02–33, శ్రీకాకుళంపై కృష్ణా 04–22, ప్రకాశంపై పశ్చిమగోదావరి 04–26, కడపజిల్లాపై కర్నూలు జట్టు 19–33 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.

బాలికల విభాగంలో.. ప్రకాశం జట్టుపై గుంటూరు 04–28, విజయనగరంపై విశాఖ 0–33, కడపపై కృష్ణా 01–33, శ్రీకాకుళంపై పశ్చిమగోదావరి జట్టు 05–21 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.

విద్యార్థులపై హాస్టల్ కమాటీ దాష్టీకం

- ఇద్దరు బాలలను విచక్షణారహితంగా రక్తమొచ్చేలా కొట్టిన వైనం
- ఒకరికి తలపై గాయాలు, మరొకరికి నడుముకు తీవ్ర గాయాలు
- కేకలు వేస్తూ బోరున విలపించిన చిన్నారులు


నడవలేని స్థితిలో ఉన్న మోహన్ ఆదిత్యను ఆస్పత్రికి భుజాలపై మోసుకెళుతున్న బంధువులు


తీవ్ర భయాందోళనతో వెక్కివెక్కి ఏడుస్తున్న విద్యార్థులు, తల్లి

ప్రత్తిపాడు: ఓ హాస్టల్ కమాటీ విచక్షణ మరిచాడు. కర్కశంగా ప్రవర్తిస్తూ విద్యార్థులపై పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. విద్యార్థుల కాళ్లు పట్టుకుని నేలకేసి కొట్టి పైశాచికంగా ప్రవర్తించాడు. రక్తగాయాలతో భయాందోళనకు గురైన విద్యార్థులు పెద్ద పెద్దగా కేకలు వేస్తూ పరిగెత్తడంతో స్థానికులు గమనించి విద్యార్థులను కమాటీ దాడి నుంచి రక్షించి బయటకు తీసుకు వచ్చిన ఘటన పెదనందిపాడులో జరిగింది. పల్నాడు జిల్లా అమరావతికి చెందిన గోవిందు నాగార్జున, లక్ష్మీ అన్నపూర్ణ దంపతుల ఇద్దరు కుమారులు జి. జ్యోతి రాజేష్, మోహన్ ఆదిత్యలను పెదనందిపాడు ఎస్సీ బాలుర వసతి గృహంలో చేర్పించారు. అక్కడే ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు బాలురు ఐదవ తరగతి చదువుకుంటున్నారు. దీపావళి సెలవులు కావడంతో ఇటీవల పిల్లలిద్దరూ ఇంటికివెళ్లారు. సెలవుల అనంతరం స్కూల్‌కు వెళ్లనని పిల్లలు మారాం చేయడంతో వారికి నచ్చజెప్పి శనివారం ఉదయం తల్లి అన్నపూర్ణ పిల్లలను తీసుకుని హైస్కూల్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న హాస్టల్ కమాటీ షేక్ అబ్దుల్ వహాబ్‌కు ఇంటివద్ద జరిగిన విషయం చెప్పి, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరి ఇంటికి బయల్దేరారు.

విచక్షణారహితంగా..

ఇదే అదనుగా కమాటీ రెచ్చిపోయాడు. పాఠశాల ఆవరణలోనే విచక్షణారహితంగా విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. జ్యోతిరాజేష్‌ను తలపట్టుకుని గోడకేసి కొట్టడంతో బాలుడి తలకు తీవ్ర రక్త గాయమైంది. భయాందోళనకు గురైన విద్యార్థి పరుగులు పెట్టాడు. మోహన్ ఆదిత్యనూ రెండు కాళ్లూ పట్టుకుని మెట్లుకేసి గట్టిగా కొట్టాడు. దీంతో అతని నడుముకు తీవ్ర గాయాలై నడవలేని, నిలబడలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులిద్దరూ పెద్ద పెద్దగా కేకలు వేశారు. గమనించిన స్థానికులు పిల్లలను అలా దారుణంగా ఎందుకు కొడుతున్నారని కమాటీని ప్రశ్నించడంతో అతని నుంచి సమాధానం కరువైంది. సమాచారం అందుకున్న తల్లి, కుటుంబ సభ్యులు వెనక్కు వచ్చి రక్తమోడుతున్న కుమారుడితోపాటు, నడవలేక నిస్సహాయ స్థితిలో ఉన్న కుమారుడిని చూసి నెత్తీనోరూ బాదుకుని కన్నీటి పర్యంతమయ్యారు. స్థానికులు చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నడవలేని స్థితిలో ఉన్న విద్యార్థిని భుజాలపై ఎత్తుకుని బంధువులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న పెదనందిపాడు ఎస్‌ఐ మధుపవన్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కమాటీని అదుపులోకి తీసుకున్నారు. అయితే సంబంధిత శాఖ అధికారులు కమాటీని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

మద్యం దుకాణం.. వద్దే వద్దు

దాచేపల్లి మండలం కేసానుపల్లిలో మహిళల ఆందోళన


వైన్‌షాప్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

దాచేపల్లి: నివాస గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరశిస్తూ మహిళలు శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. దాచేపల్లి మండలం కేసానుపల్లి రైల్వే గేటు సమీపంలో వైన్‌షాపు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ మహిళలు వైన్‌షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైన్‌షాపు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో నివాస గృహాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాల ఉన్నాయని, ఇలాంటి ప్రాంతాల్లో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల సమస్యలు ఎదురవుతాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి వైన్ షాపును తొలగించాలని మహిళలు కోరారు. వైన్ షాపు ఏర్పాటు చేసేందుకు తీసుకున్న చర్యలను ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు 'యశస్వి' వేణుగోపాలరావు అవార్డు ప్రదానోత్సవం

గుంటూరు వెస్ట్: 'యశస్వి' సర్రాజు శ్రీవేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహిస్తామని సంస్కృతి సంస్థ వ్యవస్థాపకులు సర్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయునిగా, కవిగా, గాయకునిగా విభిన్న పాత్రలను విజయవంతంగా నిర్వహించిన శ్రీవేణుగోపాలరావు ఎందరికో ఆదర్శనీయమన్నారు. ప్రస్తుతం ఆయన శిష్యులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా రుద్రవరం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నం జ్యోతివాసు, కవి, గాయకుడు, గేయ రచయిత, తెలుగు పండితుడు ఖమ్మం జిల్లా గోళ్ళపాడు జెడ్పీహెచ్‌ఎస్ అసిస్టెంట్ మేడగాని శేషగిరిరావులకు సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ సంస్కృతి ఆధ్వర్యంలో సన్మానం నిర్వహిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

పింఛన్ సొమ్ముతో పరారైన ఉద్యోగి సస్పెన్షన్

గురజాల రూరల్: సామాజిక పింఛన్లు పంపిణీ చేయకుండా ఆ సొమ్ముతో పరారైన ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన బత్తుల వెంకట నారాయణ తేలుకుట్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు గాను సచివాలయం ఉద్యోగి నుంచి రూ.2,30,000 నగదు తీసుకుని పరారయ్యాడు. గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయంపై స్పందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం సదరు ఉద్యోగిని విధులు నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పింఛన్ సొమ్ముతో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉడాయింపు

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామ సచివాలయం పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ సొమ్ముతో పరారయ్యాడు. సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాణావత్ గోవర్ధన్ నాయక్ 39 మంది పింఛన్ దారులకు సంబంధించిన పింఛన్ సొమ్ము రూ.1.76లక్షలు పంపిణీ చేయకుండా పారిపోయాడు. మండల అధికారులు వెల్ఫేర్ అసిస్టెంట్ కోసం ఎంత ప్రయత్నించినప్పటికీ అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



మాచర్ల: మాచర్ల రూరల్ ప్రాంతంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపురం జిల్లాకు చెందిన బి.భరత్‌కుమార్ (20) హాస్టల్ రూములో గుడ్డతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడి తల్లిదండ్రులు మాచర్ల వస్తే వారి ద్వారా విచారణ చేపడతామని సీఐ ప్రభాకరరావు తెలిపారు. గతంలో కూడా ఇదే కళాశాలలో హాస్టల్‌లో మనస్థాపానికి గురై పలువురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి.

దారిదోపిడీ దొంగలు అరెస్టు

చోరీ సొత్తు స్వాధీనం

నరసరావుపేట టౌన్: దారిదోపిడీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టుచేసి వారి నుంచి చోరీ సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎంవీ చరణ్ శనివారం వెల్లడించారు. గత నెల 29వ తేదీ అర్ధరాత్రి ప్రకాష్‌నగర్‌లోని వరబాబు హాస్పిటల్ నుంచి బయటకు వచ్చిన ఓ వ్యక్తి డీమార్టు వద్దకు రాగానే ఆర్టీసీ బస్టాండ్ వరకు వదిలిపెడతామని చెప్పి షేక్ నాగూల్‌మీరా, ఓర్సు మణికంఠలు అతడిని ఆటో ఎక్కించుకొని జనసంచారంలేని ప్రదేశానికి తీసుకెళ్లి గొంతుపట్టుకొని చంపుతామని బెదిరించి అతడి వద్దనున్న రూ.7వేలు నగదు, కీ ప్యాడ్‌ను తీసుకొని వదిలేశారు. ఈ మేరకు బాధిత వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై సీఐకు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు వీరాంజనేయులు, కోటేశ్వరరావు, పాండురంగారావులు నిందితులను అరెస్టుచేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వీరిని డీఎస్పీ అభినందించారు.

ఇంట్లోకి చొరబడి.. ఆభరణాలు లాక్కొని..

వృద్ధురాలి మెడలో ఆరు సవర్ల బంగారు ఆభరణాలు తస్కరణ


సంఘటనపై విచారిస్తున్న సీఐ పి.సురేష్

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి వృద్ధురాలి మెడలో బంగారు ఆభరణాలు లాక్కువెళ్లిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలో సత్తెనపల్లి ప్రధాన రహదారికి దగ్గర్లో నివసిస్తున్న వాసా నారాయణమ్మ ఇంటికి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు బండి దగ్గర ఉండగా, మరొకరు నారాయణమ్మ దగ్గరకు వచ్చి మంచినీళ్లు కావాలంటూ అడిగాడు. ఇంట్లోకి వెళ్లి మంచి నీళ్లు తీసుకొస్తుండగా వృద్ధురాలిని గోడకు అదిమిపట్టి మెడలోని నల్లపూసల దండ, కాసులపేర (ఆరు సవర్లు) లాక్కెళ్లాడని బాధితురాలు తెలిపింది. సీఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరు విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు దొంగలు ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

ఫుట్‌బాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాలబాలికల జట్లతో ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, పీడీలు

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ –19 బాల, బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నంది గామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగాయి. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 110 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికలను అండర్–19 స్కూల్ గేమ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగే 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని జి.నరసింహారావు తెలిపారు. బాలుర జట్టుకు డి.సాయి కుమార్, ఎం.ముఖేష్, వై.కార్తిక్, వి.విల్ స్మిత్, ఎ.గోపి సందీప్, జె.మోజేష్, ఎ.స్టాలిన్, ఎ.ఐజాక్, ఎస్.రేవంత్, జి.గిరి ప్రతాప్, పి.యాసిన్ ఖాన్, షేక్.ఆరిఫ్, జి.ప్రదీప్, షేక్ ఫరీద్, డి.అనేష, కె.నరేష్, ఎం.రిషి, స్టాండ్ బైలుగా పి.వేణుగోపాల్, షేక్ కాజా మొహిద్దీన్, పి.కిరణ్ కుమార్, ఎం.వినయ్ తేజ, షేక్ జుబేర్‌లు ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టుకు ఎల్.శివదుర్గ, కె.వెంకట త్రివేణి, జి.శ్రీలక్ష్మి, సిహెచ్ జ్ఞాన శ్రీ అర్చన, బి.అఖిల, కె.కారుణ్య, ఒ.దీవెన, వి.మౌనిక, టి.యామిని, ఎం.నవ్య, ఎం.అమ్ములు, ఎం.పవిత్ర పావని, కె.హేమ రాజేశ్వరి, జి.సౌజన్య, డి.కోమలి, ఎం.శ్రీలక్ష్మి మహేశ్వరి, కె.బ్లెస్సి, ఎన్.రమ్య, స్టాండ్ బైలుగా కె.రాజ్యలక్ష్మి, ఎన్.షబానా, బి.లావణ్య, జి.కుసుమలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనీల్ దత్తా నాయక్, కాకుమాను సునీత, యు.సత్యవతి, షేక్ పెద్ద కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ అండర్–19 జిల్లా జట్ల ఎంపిక


జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ అండర్ –19 బాలబాలికల విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఏఎంజీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నరసింహారావు పర్యవేక్షణలో ఈ ఎంపిక పోటీలు జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా వీరిలో ప్రతిభ చూపిన వారిని బాలుర, బాలికల జట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి పద్మాకరరావు, ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం కృపాదానం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలుర జట్టు...

ఎస్.అఖిల్, జి.మనోజ్‌కుమార్, డి.గోపికృష్ణ, పి.నిఖిల్, సీహెచ్ విష్ణు, పి.అహమ్మద్ అల్తాఫ్, డి.నాగశివ నరేంద్ర, బి.డేని, జి.చరణ్, కె.దుర్గాప్రసాద్, పి.సాయికృష్ణ, ఎస్‌కె నాషిక్.

బాలికల జట్టు...

బి.సంజన, డి.అంజు, ఎస్‌కే షాహిరా, టి.వెంకటరమణ, ఎస్‌కె హప్స, కె.యమున శ్రీ., కె.శ్రీదివ్య, కె.మౌనిక, ఎస్‌కె సానియా, ఎస్.లలిత, పి.జెస్సిక, డి.మౌనికఅర్చన.